క్లుప్తంగా

ఆటో యూనియన్ అధ్యక్షుడిగా రమేశ్



ధర్మసాగర్ : మండలంలోని తాటికాయల గ్రామంలో గల ఆదర్శ ఆటో యూనియన్ నూతన కమిటీ శనివారం ఎన్నికైంది. అధ్యక్షుడిగా పట్ల రమేశ్, ఉపాధ్యక్షుడిగా పెసరు యాదగిరి, ప్రధాన కార్యదర్శిగా ప్రవీణ్, కోశాధికారిగా పట్ల నర్సయ్య, సహాయ కార్యదర్శిగా సయ్యద్, సలహాదారులుగా కనుకటి రవీందర్, నల్ల అశోక్, ఎర్ర వెంకటస్వామి ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఎల్కతుర్తి : ఒంటరి జీవితం భరించలేక మనస్తాపం చెందిన ఓ వ్యక్తి ఈనెల 24వ తేదీన పురుగులమందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లగా కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ సంఘటన ఎల్కతుర్తి మండలం బావుపేట గ్రామంలో శనివారం చోటుచెసుకుంది. స్థానిక ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. బావుపేట గ్రామానికి చెందిన దాట్ల ప్రకాశ్ భార్య నాలుగేళ్ల క్రితం అనారోగ్యంతో మృతిచెందింది. అప్పటి నుంచి ప్రకాశ్ బాగోగులు తన కుటుంబ సభ్యులు చూసుకుంటున్నారు. ఒంటరి జీవితం గడుపలేక తీవ్ర మనస్థాపం చెందిన ఆయన ఈనెల 24వ తేదీన గడ్డిమందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఎంజీయం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న ప్రకాశ్ శుక్రవారం రాత్రి మృతి చెందినట్లు తెలిపారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఈ సందర్భంగా ఎస్సై తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు

కమలాపూర్ : మండలంలో శనివారం జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. కమలాపూర్-కానిపర్తి గ్రామాల మధ్యలో జరిగిన ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న మాదన్నపేట, గూనిపర్తి గ్రామాలకు చెందిన ఇద్దరితో పాటు కానిపర్తికి చెందిన ఆటో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. వంగపల్లి క్రాస్ రోడ్డు వద్ద బైక్ అదుపుతప్పి పడిపోయిన ప్రమాదంలో ఉప్పల్‌కు చెందిన పుల్ల ప్రవీణ్ అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను కమలాపూర్, ఎల్కతుర్తి, నడికూడ మండలాలకు చెందిన 108 అంబులెన్సుల ద్వారా వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

పరామర్శ

దామెర : బాధిత కుటుంబాలకు అండగా రేవూరి మిత్రమండలి నిలుస్తుందని ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కూనాటి రామకృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని ఊరుగొండలో కూనాటి సంజీవరెడ్డి, చిట్ల అనసూర్య, మేకల యాకమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న రామకృష్ణారెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఒక్కో కుటుంబానికి 50 కిలోల బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు సంపత్, నాయకులు మధూకర్, రమేశ్, వీరయ్య, రవి, రాజు, మధూకర్, కుమార్, సారయ్య, సాంబయ్య పాల్గొన్నారు.

శాయంపేట : మండలంలోని ప్రగతి సింగారం గ్రామానికి చెందిన పింగళి రాజిరెడ్డి శనివారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. రాజిరెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

తైక్వాండోలో అమృతవర్షిణికి గోల్డ్‌మెడల్

వరంగల్ స్పోర్ట్స్: బెంగళూరులో శనివారం జరిగిన వీఫా జాతీయస్థాయి తైక్వాండో పోటీల్లో హనుమకొండ వడ్డేపల్లి పరిమళ కాలనీకి చెందిన అమృతవర్షిణి గోల్డ్ మెడల్ సాధించింది. 6వ తరగతి చదువుతున్న ఆమె అండర్-12 పూంసే విభాగంలో బంగారు పతకాన్ని సాధించింది. పరిమళ కాలనీలో కోచ్ నవీన్ వద్ద వర్షిణి మూడేళ్లుగా శిక్షణ పొందుతోంది.

ప్రైవేట్ కళాశాల ఎదుట ధర్నా

విద్యారణ్యపురి: ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా నడిపిస్తున్నారని ఆరోపిస్తూ హనుమకొండలోని ఓ ప్రైవేట్ జూనియర్ కళాశాల ఎదుట ఎస్ఎఫ్ఐ నాయకులు శనివారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిలా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్ మాట్లాడుతూ అకాడమీల పేరుతో కళాశాలను ఒక షాపింగ్ కాంప్లెక్స్‌లోనే పెట్టి నడుపుతూ విద్యార్థుల నుంచి రూ.లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. సదరు కళాశాలపై అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. ధర్నాలో సాయికుమార్, అజయ్, మల్లేష్, అభిషేక్, పవన్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమాలకు చేయూత

హసన్‌పర్తి: నగరంలోని అతిథి దివ్యాంగుల ఆశ్రమం, లార్డు అనాథాశ్రమాలకు హసన్‌పర్తి మండలం ఎల్లాపురంలోని ఎస్సీఆర్ పాఠశాల ఆధ్వర్యంలో శనివారం చేయూతనందించారు. ఈమేరకు రూ.50 వేల విలువైన బియ్యంతో పాటు నిత్యావసర సరుకులను అందించారు. ఎస్సీఆర్ పాఠశాల డైరెక్టర్ పాల్గొన్నారు.

నిద్రలో నిఘా నేత్రాలు..

- మండలంలో పనిచేయని సీసీ కెమెరాలు
- ఇటీవల వరుస చోరీలు
- పశువులను సైతం వదలని దొంగలు
- పట్టించుకోని అధికారులు



మల్లికుదుర్లలో నిరుపయోగంగా సీసీ కెమెరాలు



పీచర ఎస్సీ కాలనీలో పనిచేయని సీసీ కెమెరాలు

వేలేరు : ఒక్క సీసీ కెమెరా వందమంది పోలీసులతో సమానమని, గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించాలని అధికారులు అవగాహన కల్పిస్తుంటారు. కానీ ప్రస్తుతంఉన్న సీసీ కెమెరాలు మరమ్మతుకు చేరుకుని మూలకు పడుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులు అవగాహన కల్పించి దాతల సహకారంతో మండలంలోని వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేశారు. వాటి నిర్వహణ గ్రామపంచాయతీలకు అప్పగించారు. అంతవరకు బాగానే ఉన్నా కొన్ని గ్రామాల్లో గ్రామ పంచాయతీ అధికారులు వాటి నిర్వహణను గాలికొదిలేయడంతో ప్రస్తుతం అవి మూలకుపడ్డాయి. దీంతో ఆయా గ్రామాల్లో వరుస చోరీలు జరుగుతున్నాయి.

రోడ్డు విస్తరణలో తొలగింపు

మండల కేంద్రంలో చేపట్టిన రోడ్డు విస్తరణలో భాగంగా సంబంధిత కాంట్రాక్టర్ సీసీ కెమెరాలు, వాటి వైర్లను తొలగించి రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. రోడ్డు నిర్మాణం పూర్తైన వెంటనే బిగిస్తానని చెప్పినా ఇప్పటి వరకు బిగించలేదు. అలాగే వివిధ గ్రామాల్లో గుర్తుతెలియని వ్యక్తులు సీసీ కెమెరాల వైర్లను కట్ చేశారు. దీంతో వరుస దొంగతనాలు జరుగుతున్నా కేసులను ఛేదించడం పోలీస్‌లకు తలనొప్పిగా మారుతోంది. గతంలో పీచర క్రాస్ రోడ్డు వద్ద ఉన్న టీ స్టాల్‌లో వరుసగా రెండుసార్లు దొంగతనం చేసి నగదు, సామాన్లు ఎత్తుకెళ్లారు. అలాగే మండలంలోని బండతండా, షోడాషపల్లి గ్రామపంచాయతీ ట్రాక్టర్ ట్రాలీ టైర్లను దొంగలు ఎత్తుకెళ్లారు. ఇటీవల మల్లికుదుర్ల గ్రామాన్ని దొంగలు టార్గెట్ చేసి వరుస చోరీలకు పాల్పడుతున్నారు. కొన్ని రోజుల క్రితం మల్లికుదుర్ల గ్రామానికి చెందిన రైతు మూడికే సిద్దులుకు చెందిన రెండు ఎడ్లు, ఒక గేదె, ఒక ఆవు, భట్టు పరమేశ్‌కు చెందిన ఒక లేగ దూడను ఎత్తుకెళ్లారు. అలాగే షోడాషపల్లికి చెందిన గొర్లకాపరి తన ఇంటి ఆవరణలో ఏర్పాటు చేసుకున్న గొర్రెలకొట్టం నుంచి ఆరు పొట్టేళ్లను రాత్రి ఎత్తుకెళ్లారు. ఇలా మండలంలో సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో దొంగలు బీభత్సం సృష్టిస్తున్నారు. అదే విధంగా అక్రమ వ్యాపారాలకు అడ్డూఅదుపు లేకుండా పోయిందని పలువురు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మండలంలోని అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాల మరమ్మతు చేపట్టి ప్రధాన కూడళ్ల వద్ద నూతన సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పశువులను ఎత్తుకెళ్లారు



పది రోజుల క్రితం వ్యవసాయ బావివద్ద సాయంత్రం పశువులను కట్టేసి ఇంటికి వెళ్లాను. ఉదయం బావివద్దకు వెళ్లి చూసేసరికి రెండు ఎద్దులు, గేదె, ఆవు, మరో వ్యక్తికి చెందిన దూడను దొంగలు ఎత్తుకెళ్లారు. మరో రైతు వ్యవసాయ బావి వద్ద పత్తి బస్తాలు, స్ప్రేయింగ్ పంపు ఎత్తుకెళ్లారు. సీసీ కెమెరాలను బాగు చేయించాలి.

– మూడికే సిద్దులు, మల్లికుదుర్ల రైతు

‘ఉత్తములకు’ ప్రశంసపత్రాల అందజేత



దామెర : ప్రశంసపత్రాలతో తహసీల్దార్ జ్యోతివరలక్ష్మీదేవి, సిబ్బంది



ఆత్మకూరు : ప్రశంసపత్రం అందుకుంటున్న సాజీదాబేగం



శాయంపేట : ప్రశంసపత్రం అందుకుంటున్న శ్వేత

దామెర : తహసీల్దార్ జ్యోతివరలక్ష్మీదేవి ఉత్తమ ఏఈఆర్వో అవార్డును శనివారం అందుకున్నారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎన్నికల విధుల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన అధికారులకు, ఉద్యోగులకు అవార్డులను పంపిణీచేశారు. అందులో భాగంగా తహసీల్దార్‌తో పాటు ఉత్తమ సూపర్‌వైజర్ అవార్డును జూనియర్ అసిస్టెంట్ మురళి, ఉత్తమ బీఎల్ఓగా పులుకుర్తి ఆశవర్కర్ రమణకు జిల్లా కలెక్టర్ ప్రావీణ్య చేతులమీదుగా ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పరకాల ఆర్డీఓ నారాయణ అభినందించారు.

ఉత్తమ బీఎల్ఓగా సాజీదాబేగం

ఆత్మకూరు : ఉత్తమ బీఎల్ఓగా మండల కేంద్రానికి చెందిన సాజీదాబేగం ఎంపికయ్యారు. శనివారం ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని హనుమకొండ కలెక్టర్ కార్యాలయంలో అడిషనల్ కలెక్టర్ వెంకట్‌రెడ్డి చేతులమీదుగా ప్రశంసపత్రాన్ని అందుకున్నారు. తనను ఉత్తమ బీఎల్ఓగా ఎంపిక చేసినందుకు ఆమె అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

శాయంపేటలో..

శాయంపేట : మండల కేంద్రానికి చెందిన అంగన్‌వాడీ టీచర్ శ్వేత ఉత్తమ బీఎల్ఓగా ఎంపికైయ్యారు. శనివారం భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ చేతుల మీదుగా ప్రశంసపత్రం అందుకున్నారు.

ముళ్లచెట్ల తొలగింపు



సాక్షి ఎఫెక్ట్..

నడికూడ : పరకాల–హుజూరాబాద్ ప్రధాన రోడ్డు డివైడర్ మధ్యలో పెరిగిన ముళ్లచెట్లను అధికారులు శనివారం తొలగించారు. డివైడర్ మధ్యలో ముళ్లచెట్లు ఏపుగా పెరగడంతో వాహనదారులు గాయపడుతున్నారని సాక్షి దినపత్రికలో శుక్రవారం ‘గాయపరుస్తున్న ముళ్లచెట్లు’ కథనం ప్రచురితం అయ్యింది. దీంతో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ చేతన్‌కుమార్‌రెడ్డి స్పందించారు. వెంటనే వాటిని తొలగించాలని పంచాయతీ సిబ్బందికి ఆదేశించారు. ఈ సందర్భంగా పంచాయతీ సిబ్బంది ముళ్లచెట్లను తొలగించారు. దీంతో పలువురు వాహనదారులు సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.

పౌరులకు ఓటుహక్కు వజ్రాయుధం



శాయంపేట : మానవహారం చేపట్టిన విద్యార్థులు



కమలాపూర్ : ప్రతిజ్ఞ చేస్తున్న కళాశాల విద్యార్థులు



ఓటరు కార్డులు పంపిణీ చేస్తున్న తహసీల్దార్

శాయంపేట : పౌరులకు ఓటుహక్కు వజ్రాయుధమని తహసీల్దార్ కల్వల సత్యనారాయణ అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం మండల కేంద్రంలోని ఎంజేపీ, సోషల్ వెల్ఫేర్, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించి ప్రధాన చౌరస్తాలో విద్యార్థులు మానవహారం చేపట్టారు. విద్యార్థులతో ఓటు హక్కు వినియోగంపై ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ.. ప్రతి ఏడాది మూడుసార్లు ఓటరు నమోదు చేసుకునే అవకాశం ఉంటుందని, 18 సంవత్సరాలు నిండిన యువతి, యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఎన్నికల్లో రాజకీయ పార్టీల ప్రలోభాలకు ఓటర్లు తలొగ్గొద్దని అన్నారు. ప్రజలకు మంచి చేసే నాయకులను ఎన్నుకునే అవకాశం ఓటు హక్కుతోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఫణిచంద్ర, డిప్యూటీ తహసీల్దార్ ప్రభావతి, ఎంపీఓ రంజిత్ కుమార్, ఏపీఓ అనిత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునితారెడ్డి, పంచాయతీ కార్యదర్శి రత్నాకర్, బీఎల్ఓలు, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కమలాపూర్ : ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్, తహసీల్దార్ కార్యాలయం ఆధ్వర్యంలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని మండల కేంద్రంలో శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులతో కలిసి గ్రామంలో ఓటరు దినోత్సవ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఓటుహక్కు జన్మహక్కు అని, 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ తప్పనిసరిగా ఓటు హక్కు పొందాలని విద్యార్థులు నినాదాలు చేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, ఎన్ఎస్ఎస్ పీఓ జ్యోతి, అధ్యాపకులు, రెవెన్యూ అధికారులు, బీఎల్ఓలు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరకాల : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాజనీతి శాస్త్రం, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, అధ్యాపకులు ఓటరు ప్రతిజ్ఞ చేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సంతోశ్‌కుమార్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ మల్లయ్య, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి అశోక్‌మోరె, రాజనీతి శాస్త్రం అధ్యాపకుడు డాక్టర్ ఆడెపు రమేశ్‌తో పాటు అధ్యాపకులు పాల్గొన్నారు.

నడికూడ : జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని తహసీల్దార్ నాగరాజు ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో అవహగాన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : మండల కేంద్రంలో శనివారం ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని ఓటరు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఓటరు కార్డులు పంపిణీ చేశారు. తహసీల్దార్ జగన్‌మోహన్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీస్ పాల్గొన్నారు.

దామెర : రాజ్యాంగం కల్పించిన ఓటుహక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ఎంఈఓ లకావత్ రాజేశ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జాతీయ ఓటు హక్కు దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హత కలిగిన యువత ఓటరుగా నమోదు చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐలు సంపత్, భాస్కర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి మనోహర్, భిక్షపతి, బీఎల్ఓలు, విద్యార్థులు పాల్గొన్నారు.

అర్హులకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలి



మాట్లాడుతున్న నాయకులు

శాయంపేట : ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో అర్హులకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని బీఎస్ఎస్, దళిత సంఘాల నాయకులు దేవయ్య, క్రాంతికుమార్ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం మండల కేంద్రంలో వారు విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రజలు ఇందిరమ్మ రాజ్యంపై నమ్మకంతో కాంగ్రెస్ పార్టీకి అధికారం అప్పగించారని, ఇందిరమ్మ పేరుకు భంగం కలగకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల అర్హుల ఎంపికలో అవకతవకలు జరుగకుండా చూడాలని అన్నారు. అర్హులకు అన్యాయం జరిగితే ఊరుకోమని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. బీఎస్ఎస్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సుమన్, జిల్లా నాయకులు విజయ్, రవీందర్, వరలక్ష్మి, పాపయ్య, అశోక్, సురేష్ పాల్గొన్నారు.

నిరుపేదలకు అండగా సీపీఐ



మాట్లాడుతున్న సదానందం

శాయంపేట : నిరుపేదలకు సీపీఐ అండగా నిలుస్తోందని ఆ పార్టీ మండల కార్యదర్శి బత్తిని సదానందం అన్నారు. మాందారిపేటలో మాట్లాడుతూ.. దున్నేవాడికే భూమి కావాలని దేశ వ్యాప్తంగా పోరాటాలు చేసి లక్షల ఎకరాల భూమిని నిరుపేదలకు పంపిణీ చేసిన చరిత్ర సీపీఐకి ఉందని గుర్తు చేశారు. పార్టీ ఏర్పడి 100 సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా హనుమకొండలోని హరిత హోటల్‌లో ప్రారంభమైయ్యే ఉత్సవాలకు తరలిరావాలని పిలుపునిచ్చారు.

నేడు సంక్షేమ పథకాలు ప్రారంభం

శాయంపేట : రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని గట్లకానిపర్తి గ్రామంలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఆదివారం ప్రారంభించనున్నట్లు డీడబ్ల్యూఓ, మండల స్పెషల్ ఆఫీసర్ జయంతి తెలిపారు.

మున్సిపల్ పాలకవర్గానికి ఘనంగా వీడ్కోలు



మున్సిపల్ పాలకవర్గానికి వీడ్కోలు పలుకుతున్న కమిషనర్ సుష్మ

పరకాల : మున్సిపల్ పాలకవర్గ ఐదేళ్ల పరిపాలన కాలం శనివారంతో ముగిసింది. శనివారం మున్సిపల్ చివరి కౌన్సిల్ సమావేశం అనంతరం కమిషనర్ కె.సుష్మతో పాటు అధికారులు, మున్సిపల్ ఉద్యోగులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు మున్సిపల్ పాలకవర్గాన్ని సన్మానించి ఘన వీడ్కోలు పలికారు. వీడ్కోలుకు ముందు మున్సిపల్ సమావేశంలో 23 ఎజెండా అంశాలపై చర్చించి ఏకగ్రీవంగా తీర్మానించారు.

రైతులకు ద్రోహం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

- మాజీ ఎమ్మెల్యే రాజయ్య ధ్వజం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య

ధర్మసాగర్ : రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ద్రోహం చేస్తుందని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడమే కాకుండా ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేసిందని మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య ధ్వజమెత్తారు. మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం రైతులకు మద్ధతుగా దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతు రుణమాఫీ పూర్తిగా అమలు చేయలేకపోవడం, వాగ్దానాలను కేవలం ప్రచారానికే పరిమితం చేయడం కాంగ్రెస్ అసమర్ధతకు నిదర్శనంగా నిలుస్తోందని విమర్శించారు. రైతు భరోసా పథకం ద్వారా సంవత్సరానికి రూ.15,000 అందించాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలు పరిష్కరించని పక్షంలో కాంగ్రెస్ పార్టీ మోసపూరిత వైఖరికి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు కాంగ్రెస్ పార్టీ సంక్షేమ పథకాలు అందిస్తామని మాయమాటలు చెబుతుందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్ కర్ర సోమిరెడ్డి, నాయకులు మారపాక రవి, ఆకుల కుమార్, బొడ్డు ప్రభుదాస్, జుబేదా, లాల్ మహ్మద్, మెరుగు రాజిరెడ్డి, బొడ్డు ప్రతాప్, బాలరాజు, నర్సింగరావు, భూపతి రాజు, జోజి, శ్రీనివాస్, బాలు, రమేశ్, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

వాహనదారులు హెల్మెట్ ధరించాలి

- సీఐ రంజిత్‌రావు



మాట్లాడుతున్న సీఐ రంజిత్‌రావు

శాయంపేట : ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలని సీఐ రంజిత్‌రావు సూచించారు. మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థులకు రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతీఒక్క వాహనదారుడు అతివేగంగా వెళ్లకుండా హెల్మెట్ ధరించి నెమ్మదిగా వెళ్లాలని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు వాహనాలు ఇవ్వొద్దని సూచించారు. డ్రంకెన్ డ్రైవ్, ట్రిపుల్ రైడింగ్‌కు ఆస్కారం లేదని అన్నారు. ఫోర్‌వీలర్స్ వాహనదారులు తప్పకుండా సీట్‌బెల్ట్ ధరించి సురక్షితంగా గమ్యం చేరుకోవాలని అన్నారు. మద్యం సేవించి వాహనాలు నడుపొద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై పరమేశ్, పాఠశాల ప్రిన్సిపాల్ రజని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డార్విన్ సూత్రాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న ధర్మప్రకాశ్

ధర్మసాగర్ : డార్విన్ ప్రాథమిక సూత్రాలు ఆధునిక జీవశాస్త్రం, వైద్యం, జీవుల పరిరక్షణపై ప్రభావితం చేస్తాయని, వాటిపై అవగాహన కలిగి ఉండాలని పర్యావరణ విభాగం రాష్ట్ర కన్వీనర్ ధర్మప్రకాశ్ అన్నారు. మండలంలోని ముప్పారం శివారులో గల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు శనివారం డార్విన్ పరిణామ సిద్ధాంత ప్రచార ఉద్యమంలో భాగంగా అవగాహన కల్పించారు. డార్విన్ పరిణామ సిద్ధాంతం ఆధునిక జీవ శాస్త్రానికి మూల స్తంభమని అన్నారు. పూర్వికుల నుంచి ఆవిర్భవించి మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా జీవులు పరిణామం చెందడం సహజ లక్షణం అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఎస్ఓ మాధవి, సైన్స్ ఉపాధ్యాయుడు సురేశ్, అధ్యాపక బృందంతో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో గెలుపు కోసమే కాంగ్రెస్ ఎత్తుగడలు

- బీజేపీ మండల అధ్యక్షుడు రామకృష్ణ



మాట్లాడుతున్న రామకృష్ణ

శాయంపేట : స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపు కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల జాబితా, గ్రామసభలకు తెరలేపిందని బీజేపీ మండల అధ్యక్షుడు నరహరిశెట్టి రామకృష్ణ విమర్శించారు. శనివారం మండల కేంద్రంలో ఆ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభల్లో ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు అర్హులైన నిరుపేదల పేర్లు జాబితాలో రాకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ప్రజలను తమ వైపు తిప్పుకోవాలనే కుట్రతోనే సంక్షేమ పథకాలు అమలు చేస్తామంటూ మాయమాటలు చెబుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వనం దేవరాజ్, కడారి చంద్రమౌళి, రాజేష్, రాజశేఖర్, శ్రీకాంత్, సుధాకర్, సుమన్, రాకేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

రాజకీయ ఉనికి కోసమే ‘రేవూరి’పై విమర్శలు

- కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్
- మాజీ ఎమ్మెల్యే ‘చల్లా’ దిష్టిబొమ్మ దహనం



పరకాల : ధర్మారెడ్డి దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

పరకాల : రాజకీయ ఉనికి కోసమే ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిపై మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి విమర్శలు చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్, మండల అధ్యక్షుడు కట్కూరి దేవేందర్‌రెడ్డి అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రాముఖ్యం కలిగిన పరకాల నియోజకవర్గాన్ని తన స్వార్థ ప్రయోజనాల కోసం ముక్కలు చేసిన ఘనత మాజీ ఎమ్మెల్యే ధర్మారెడ్డికే దక్కుతుందని విమర్శించారు. ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిపై మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా కాంగ్రెస్ నాయకులు పట్టణంలో శనివారం ధర్మారెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమానికి పాటుపడే రేవూరి ప్రకాశ్‌రెడ్డిని విమర్శించడం ధర్మారెడ్డి అవివేకానికి నిదర్శనమన్నారు. గత ప్రభుత్వ పాలనలో చల్లా ధర్మారెడ్డి నియోజకవర్గ అభివృద్ధిని పట్టించుకోకుండా ఇసుక, మొరం దందాలను ప్రోత్సహిస్తూ ప్రజాధనాన్ని దోచుకున్నారని ఆరోపించారు. జిల్లాల పునర్విభజన సమయంలో విదేశీ పర్యటనలో ఉండి పరకాలను జిల్లా కేంద్రం కాకుండా నష్టం చేసిన విషయాన్ని మరిచిపోయి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనిత, కౌన్సిలర్స్ పంచగిరి జయమ్మ, మడికొండ సంపత్, బండి రాణి, మార్క ఉమాదేవి, నల్లెల జ్యోతి, పసుల లావణ్య, మాజీ ఎంపీపీ ఓంటేరు రాంమూర్తి, కాంగ్రెస్ నాయకులు గోనాథ్, రాఘవరెడ్డి, వేణుగోపాల్, శ్రవన్, శ్రీనివాస్, శ్రీశైలం, వెంకటస్వామి, జాఫర్, భాస్కర్‌రెడ్డితో పాటు తదితరులు పాల్గొన్నారు.

దామెర : ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి దుర్శెట్టి భిక్షపతి హెచ్చరించారు. మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి చేసిన వ్యాఖ్యలకు నిరసనగా మండల కేంద్రంలో ధర్మారెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. సీనియర్ నాయకులు పోశాలు, శంకర్, మాజీ ఎంపీటీసీ ప్రవీణ్, రాజు, కొమ్మాలు, వేణు, సందీప్, రాజేందర్, దామెర కట్టయ్య, లింగయ్య, రవి, యువజన నాయకులు రవికుమార్, రతన్‌కుమార్ పాల్గొన్నారు.

ఆత్మకూరు : ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిని విమర్శించడం సరికాదని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కమలాపురం రమేశ్ అన్నారు. మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి చేసిన వ్యాఖ్యలకు నిరసనగా శనివారం మండల కేంద్రంలో చల్లా ధర్మారెడ్డి దిష్టి బొమ్మను దహనం చేశారు. నాయకులు పాల్గొన్నారు.